

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | శనివారం | నవంబర్ 25, 2023 | www.navatelangana.com



సురక్షిత కాన్పుకు ఆరోగ్య కేంద్రమే మేలు

- వైద్యాధికారి నిఖిల్
- భీంపూర్ పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు

4లో...



మతోన్మాద బీజేపీని ఓడించి లౌకికవాద పార్టీలను బలపర్చాలి

- ఏఐఏడబ్ల్యూ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్

3లో...

ఏసీబీ వలకు చిక్కిన ఎస్సై వెంకటేష్

- రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

నవతెలంగాణ-చింతలమానేపల్లి



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి ఎస్సై వెంకటేష్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు చిక్కారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దింద గ్రామానికి చెందిన వివాహిత యువతి గత నెల రెండవ తేదీన తన కుటుంబ కలహాలతో ఇంట్లో నుండి వెళ్లిపోయి రెండు రోజులుగా మహారాష్ట్రలోని అహెరి గ్రామానికి వెళ్లి తిరిగి రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చారు. అదే గ్రామానికి చెందిన డోకే ప్రశాంత్ యువతికి సహకరించినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు రాగా పై విషయంపై డోకే ప్రశాంత్‌ను రూ.70వేలు చెల్లించాలని ఎస్సై కోరారు. లేని యెడల ఈ కేసులో అభియోగాలు మోపి జైలుకు పంపిస్తానని పలుమార్లు బెదిరింపులకు గురిచేశారు. అన్ని డబ్బులు సర్దుబాటు చేయలేనని రూ.20వేలు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మధ్యవర్తిగా చింతలమానేపల్లి మండల కేంద్రంలోని డొకే శ్రీను ఇంట్లో ఎస్సై డ్రైవరు హోంగార్డు జనార్ధన్‌కు రూ.20వేలు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించగా రూ.20వేలు ఆయన వద్ద దొరికినట్లు అధికారులు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ప్రత్యేక కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

గులాబీ శ్రేణుల్లో జోష్..!

- బీఆర్ఎస్‌లో ఉత్సాహం నింపిన సీఎం పర్యటన
- పల్లె, పట్టణాల నుంచి భారీగా తరలివచ్చిన జనం
- కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం వృథా అని వ్యాఖ్య
- మంచిర్యాల అభ్యర్థి దివాకర్‌రావును గెలిపించాలని విజ్ఞప్తి







నవతెలంగాణ-హాజీపూర్, నస్పూర్

మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. పల్లె, పట్టణాల నుంచి తండోపతండాలుగా జనం తరలిరావడంతో సభా ప్రాంగణం పరిసరాలు గులాబీమయంగా మారాయి. శుక్రవారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో

మిగతా..2లో...









ముధోల్‌లో త్రిముఖ పోటీ..!

- పోటాపోటీగా తలపడుతున్న ప్రధాన పార్టీలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీ
- విజయమే లక్ష్యంగా పల్లెల్లో ముమ్మర ప్రచారాలు
- అగ్రనేతల సభలతో జనాన్ని ఆకట్టుకునే ప్రయత్నం

నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ రాజకీయాలు రసకందాయంగా మారుతున్నాయి. పోలింగ్ సమయం దగ్గర పడటంతో ప్రధాన పార్టీల మధ్య సమరం నువ్వా-నేనా అనే రీతిలో సాగుతోంది. ఎవరికి వారు ముమ్మర ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సొంత సర్వేలు చేయిస్తూ గెలుపు తమదేననే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేయాలని భావిస్తున్నారు. ఇక్కడ మూడు ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీ పోరు సాగనుందని తెలుస్తోంది. ఇప్పటికే ఆయా పార్టీల తరపున అగ్రనేతలు ప్రచారం నిర్వహించగా.. జనాలను తమవైపునకు ఆకట్టుకునేందుకు వివిధ హామీలు గుప్పించారు. మరికొన్ని రోజుల్లో పోలింగ్ జరగనుండటంతో ప్రలోభాల పర్వం కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది. విందులు, డబ్బుల పంపిణీ కూడా మొదలైనట్లు సమాచారం. ఈ ముక్కోణపు పోటీలో ఎవరు విజేతలో డిసెంబర్ 3న వెల్లడికానుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మిగతా..2లో...

పేదల పక్షాన పనిచేస్తా

● చేతు గుర్తుకు ఓటేసి గెలిపించండి ● ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజా



నవతెలంగాణ-జన్నారం

పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని చేయి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు కోరారు. శుక్రవారం మండలంలోని నాయకపోడ్ గూడా, ఇందన్‌పల్లి, కలమడుగు, ముర్రిగూడా, కుమ్రపల్లి, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు, కలమాడుగు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ఆ రెండు పార్టీలు తోడు దొంగలన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి కాకపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి కారణమన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రాథోడ్ రమేష్‌కి ఇన్ని సార్లు అవకాశం ఇచ్చారు. ఒక్కసారి పేదవాడైనా తనకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ఫసీఉల్లా, గంగన్న, రాజన్న పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ముస్లిం మైనారిటీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం తెలిపారు. శుక్రవారం లక్షెట్టిపేట కాంగ్రెస్ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం మసీదులవద్ద ప్రచారంనిర్వహించారు. కాంగ్రెస్ చేయబోయే సంక్షేమ పథకాలు, ముస్లిం మైనారిటీ లకు కోసం ఏర్పాటు చేసిన మేనిఫెస్టో పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించారు. గతంలో కాంగ్రెస్ హయం లోనే మైనారిటీల 4 శాతం రిజర్వేషన్లు, విద్య, వైద్య రంగాల్లో మైనారిటీల అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కొత్త జంటలకు షాది ముబారక్ ద్వారా రూ.1.60.000, గృహ వినియోగాలకు రూ.500 లకే సిలిండర్, ఇంటి స్థలం, పెన్షన్లు పెంచి ఇవ్వాలని పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అధికారంలో లేకున్న స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న మాజీ



ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మైనారిటీ సోదరులకు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నాగభూషణం, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎండీ, ఆరిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, మైనారిటీ నాయకులు సయ్యద్ షాహిద్ ఆలీ, వార్డ్ అధ్యక్షుడు సూరం చంద్రమౌళి, అమీర్, హాజి, మైనారిటీ నాయకులు సయ్యద్ హఫీజ్, ముఖరంజ పాల్గొన్నారు.

కోరం లేక సర్వ సభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-వేమనపల్లి

ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మూడు నెలలకు ఒకసారి మండల సమస్యలపై చర్చించే మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరు కాకపోడంతో కోరం లేక సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య ప్రకటించారు. ఎన్నికల నేపథ్యంలో ఎంపీపీతో సహా సభ్యులెవరూ హాజరు కాలేదు. మళ్ళీ మూడు నెలల లోపు సర్వ సభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం

జన్నారం : బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో మరోసారి అధికారంలోకి వస్తేనే ప్రజా సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా అమలు అవుతాయని మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ తపాలాపూర్ చింతగూడ కామన్ పల్లి లింగయ్య పల్లి చింతలపల్లి, తదితర గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు విస్తతంగా గడపగడపకు తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కారు గెలిస్తేనే మహిళలకు రూ.3000 నగదు, రూ.400 కే సిలిండర్, అందిస్తామన్నారు. తెలంగాణలో మరోసారి కేసీఆర్‌ను ఖానాపూర్ నియోజకవర్గంలో జాన్సన్ నాయకులు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేరం శ్రీనివాస్, పిండి నరేష్, శ్రీపతి బుచ్చన్న కమల విజయ ధర్మ పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్..!

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెలే దివాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సభాస్థలికి చేరుకున్న ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తొలుత ఈ ప్రాంత చైతన్యం, చరిత్రపై వివరించడంతో పాటు ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. ఎన్నికలు రాగానే ఆగమాగం కావద్దని.. ఆయా రాజకీయ పార్టీల చరిత్ర, వాటి నడవడిక, వ్యక్తుల గుణగణాలను తదితర అన్నింటినీ బేరీజు వేసి ఓటు వేయాలని జనాలకు సూచించారు. సభలో ఎక్కువ సమయం బీఆర్ఎస్‌కు ప్రత్యర్థులుగా భావిస్తున్న కాంగ్రెస్, బీజేపీలపైనే విమర్శనస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి పరిస్థితి. బీఆర్ఎస్ పాలనలో ఈ సంస్థ సాధించిన అభివృద్ధిని వివరించారు. సింగరేణి కార్మికులకు ఇన్ కమ్ టాక్స్ రద్దు ను మోడీ వాయిదా వేస్తున్నారని, జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటులో బీజేపీ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ.. జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేయడం బీఆర్ఎస్ ఘనతగా చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీజేపీలతోనే ఈ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని వివరించారు.

రైతుబంధు సృష్టించింది బీఆర్ఎస్

రైతుబంధు, రైతుభీమా సృష్టించింది బీఅర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు.కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని వివరించారు. సంక్షేమం అంటే ఏమిటో దేశానికి చూపించామని చెప్పారు. రూ.200 పింఛన్ నుంచి రూ.2వేలకు పెంచామని..మరోసారి ప్రభుత్వం రాగానే రూ.5వేలు అందిస్తామని చెప్పగా ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంతో చప్పట్లు కొట్టారు. గల్లీలోనూ బస్తీ దవఖానాలను ఏర్పాటుచేసి ప్రతి గడపకు ఉచిత వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభ ద్వారా రైతుబంధు రూ.16 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 24గంటల ఉచిత విద్యుత్, ఎల్లంపల్లి,గూడెం లిఫ్ట్ ద్వారా



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

మంచిర్యాల నియోజకవర్గంలో పంటలు సమృద్ధిగా పండుతున్నాయని గుర్తుచేయగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు మంచి మనిషి, సౌమ్యుడని ప్రసంశించారు.తన వద్దకు నియోజకవర్గ పనుల కోసం మాత్రమే వస్తారని ఏనాడు సొంత పనులు అడగలేదని తెలిపారు.మంచిర్యాలలో ఓ అభ్యర్థి పేకాట క్లబ్బులు పెట్టి రూ. వేలకోట్లు సంపాదించి ఇక్కడి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని,ఆయన గెలిస్తే గల్లీ కో పేకాట క్లబ్ ఏర్పాటు చేస్తారని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి కూడా బాగానే తిరుగుతున్నారని తెలుస్తుంది.ఆయనకు ఓటేస్తే మీ ఓటు వృధా అవుతుందని చెప్పారు. ఎన్నికల్లో గెలిపిస్తే దివాకర్‌రావు అడిగిన కరకట్టను వేసవిలోనే నిర్మించి చుక్క వరద నీరు రాకుండా చూస్తామని హామీనిచ్చారు.

భారీగా తరలివచ్చిన జనం..!

ప్రజా ఆశీర్వాద సభకు మంచిర్యాల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల ద్వారా వేలాది సంఖ్యలో సభా మైదానానికి వరుసకట్టారు. సభా ప్రాంగణానికి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఎక్కడ చూసినా ప్రజలే కనిపించారు. గులాబీ జెండాలు ధరించి తెలంగాణ సభాస్థలికి రావడంతో మంచిర్యాల పట్టణం, నస్పూర్ కలెక్టరేట్ ప్రాంతం గులాబీమయంగా మారింది. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో జనాలు కేరింతలు కొడుతూ ఉత్సాహం కనబర్చారు. సభా ఏర్పాటుచేసిన ప్రాంతం పూర్తిగా నిండిపోవడంతో పాటు వేలాది మంది జనం రోడ్లపై నిలబడి స్కీన్ల ద్వారా సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, టీబీజీకేఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలిపిస్తే మరింత అభివృద్ధి

-దివాకర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే మంచిర్యాల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. ఎదుటి వ్యక్తికి ఓటేస్తే అవినీతి రాజ్యమేలుతుందన్నారు.తన హాయాంలోనే ఎల్లంపల్లి, ర్యాలీ వాగు ప్రాజెక్ట్,గూడెం లిఫ్ట్ ఏర్పాటైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ చేతిలో ఉంటే ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. సింగరేణి కార్మికులకు 3500మందికి ఇళ్ళ పట్టాలు ఇప్పించినట్టు తెలిపారు.ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై వివరించారు. మరోసారి గెలిపించి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

ముధోల్‌లో త్రిముఖ పోటీ..!

(మొదటి పేజీ తరువాయి)

నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. మహారాష్ట్ర సరిహద్దున ఉండే ఈ నియోజకవర్గంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. బాసర సరస్వతి కొలువుదీరిన ఈ నియోజకవర్గం దేశవ్యాప్తంగా పేరుగాంచింది. తాజా ఎన్నికల్లోనూ ఇక్కడ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇక్కడ 23మంది నామినేషన్లు వేయగా ముగ్గురివి తిరస్కరణకు గురయ్యాయి. మరో ఆరుగురు అభ్యర్థులు ఉపసంహరించుకోగా మిగిలిన 14మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వరుసగా రెండు సార్లు అధికార బీఆర్ఎస్ పార్టీ ఈ సీటును కైవసం చేసుకోగా.. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని భావిస్తోంది. ఇది వరకు 2009లో ఇక్కడ కాంగ్రెస్ గెలిచినప్పటికీ పదేండ్లుగా అధికారానికి దూరంగా ఉంది. మరోపక్క ఈ నియోజకవర్గంలో ఒక్కసారి కూడా విజయం సాధించని బీజేపీ తొలిసారి పాగా వేయాలని భావిస్తోంది. ఇక రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీలతో పాటు స్వతంత్రులుగా బరిలో నిలిచిన పలువురు అభ్యర్థులు సైతం ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు అభ్యర్థులు గణనీయ సంఖ్యలో ఓట్లు సాధించి ప్రభావం చూపించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీలు తరపున ఆ పార్టీ అగ్రనేతలు హాజరై జనాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

హోరాహోరీలో విజేత ఎవరు..?

ముధోల్ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు జరుగుతోంది. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు విజయం సాధించిన విఠల్‌రెడ్డి మరోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పదేండ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామస్థాయిలో పార్టీ క్యాడర్ బలంగా ఉండటం వంటి అంశాలు మరోసారి విజయానికి సానుకూలంగా మారగా.. సహజంగా వచ్చే ప్రభుత్వ వ్యతిరేకత, ప్రభుత్వ పథకాలు అందరికీ అందకపోవడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను విస్మరించారనే అపవాదు ఉండటం ప్రతికూలంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ విజయం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఎన్‌సీపీ నుంచి పోటీ చేసినా ఓటమి చవిచూశారు. ఇది వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో నియోజకవర్గంలో పరిచయాలు కలిగి ఉండటం..గతంలో చేసిన అభివృద్ధితో పాటు కాంగ్రెస్ గాలి వీయటం వంటి అంశాలు విజయానికి సానుకూలంగా మారుతాయని భావించగా.. కొన్నేండ్ల పాటు రాజకీయాల్లో క్రియాశీలకంగా లేకపోవడం వంటి అంశాలు ప్రతికూలంగా మారుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక బీజేపీ నుంచి రంగంలోకి దిగిన రామారావుపటేల్ విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఆయన ఏడాది క్రితం బీజేపీలో చేరి టికెట్ దక్కించుకున్నారు. గతంలో ఓడిపోయిన సానుభూతితో పాటు ఈ సారి బీజేపీకి అనుకూలమైన వాతావరణం ఉందనే ప్రచారం తాజా ఎన్నికల్లో సానుకూలంగా మారుతుందని భావిస్తుండగా.. ప్రత్యర్థి పార్టీలు బలంగా ఉండటం ప్రతికూలంగా మారే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరితో పాటు పలువురు స్వతంత్రులు, రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం ముమ్మర ప్రచారం నిర్వహించడంతో ఓట్లు భారీగా చీలే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ హోరాహోరీ పోరులో ఎవరు విజేతలెవరో.. పరాజితులెవరో డిసెంబర్ 3న తేలిపోనుంది.

నవతెలంగాణ
నిర్మల్
శనివారం నవంబర్ 25, 2023

ఘనంగా అంతర్జాతీయ జీవ పరిణామ దినోత్సవం

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మండలం చిట్యాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ జీవ పరిణామ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు గజపల్లి నర్సయ్య మాట్లాడారు. అనేక సాక్ష్యాలు, ఆధారాలతో ఋజువు చేయబడ్డా సిద్ధాంతం జీవపరిణామ సిద్ధాంతమని అన్నారు. విద్యార్థులు సైన్స్‌ను ఆకలింపు చేసుకుని శాస్త్రీయ దృక్పథంను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమార్, పోతన్న, వహీద్, రాజేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీలను ఓడించాలి



నవతెలంగాణ- ఖానాపూర్

ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో నియంతృత్వ బీఆర్ఎస్, మతోన్మాద బీజేపీ, ఎంఐఎం పార్టీలను ప్రజలు ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలోని సోమార్‌పేట, కొలాంగూడ, బీర్‌నంది గ్రామాల్లో సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికలపై ప్రచారాలు, సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రజల చేతిలో ఒక వజ్రాయుధమని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో మతోన్మాద పాసీజం నియంతృత్వంతో ప్రజాస్వామిక హక్కులను కాల రాస్తున్నారని అన్నారు. ఇక నిరుద్యోగుల, ఉద్యోగ ఉపాధ్యాయుల విషయంలో మరింత దారుణంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. నోటిఫికేషన్లు, పరీక్షలు వాటి లీకేజీల అమ్ముకోవడం, పరీక్షల రద్దుతో నిరుద్యోగుల ఆశలపై నిప్పులు పోశారని మండిపడ్డారు అందుకే వీళ్లకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు జక్కుల రాజన్న, గోరె భాయ్, కుంచపు ఎల్లయ్య, సిడం సోనేరావు, ఆత్రం భీంరావు, ఆత్రం లాలూ, కొడప భీంరావు, ఆనంద్‌రావు, టేకం భీంరావు పాల్గొన్నారు.

విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు రవిరంజన్ కుమార్, విక్రమ్, కే.గోపాలకృష్ణలు అన్నారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మైక్రో అబ్జర్వరులు పోలింగ్ రోజున చేపట్టే విధివిధానాల శిక్షణా కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు పాల్గొని మాట్లాడారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సూక్ష్మ పరిశీలకుల విధులు కీలకమని అన్నారు. తప్పక చెక్‌లిస్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లో జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడానికి నియమించడం జరుగుతుందని అన్నారు. బూత్‌లో ప్రతి అంశాన్ని పరిశీలన చేయాలని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు ఈ నెల 29న డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో హాజరు కావాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30కి మాక్ పోలింగ్ నిర్వహణ, మాక్ పోలింగ్ 50 ఓట్లు వేశారా లేదా పరిశీలన చేయాలని సూచించారు. పీఓ ఒక్కరికే సెల్ ఫోన్ అనుమతి ఉన్నదని తెలిపారు. పీఓ డైరీలో అన్ని సంఘటనలు ఎప్పటికప్పుడు నమోదు చేసే విధానాన్ని పరిశీలన చేయాలన్నారు. ఎంత మంది పోలింగ్ ఏజెంట్లు హాజరు అయినది, లేనిది తప్పక చూడాలని అన్నారు. ముఖ్యంగా ఈవీఎంలు సరిగా అనుసంధానం చేసి మాక్ పోలింగ్ తర్వాత క్లియర్ బటన్ నొక్కరా లేదా పరిశీలించాలని సూచించారు. ఈవీఎంలు ప్రాపర్‌గా సీల్ చేయడాన్ని పరిశీలించాలన్నారు. 17ఏ అలాగే 17సి ఏజెంట్లకు ఇచ్చారా పరిశీలన చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు పరిశీలన చేయాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లలకు రెండో శిక్షణ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఉంటుందని అన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ముగిసిన అనంతరం సాధారణ పరిశీలకులకు రిపోర్ట్‌లు సబ్మిట్ చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లో ప్రశాంతంగా నిబద్ధతతో పనిచేయాలని ఆన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పోలింగ్ రోజు విది విధానాలు, ఈవీఎం అనుసంధానం, పని చేయు, విధానం గురించి మాస్టర్ ట్రైనర్ వివారించారు. సమావేశంలో డీఈఓ రవీందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, శిక్షణ మైక్రో అబ్జర్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల వేళ తెరపైకి సదర్‌మాట్

● గెలుపోటములను ప్రభావితం చేయనున్న ఆయకట్టు రైతులు



సదర్‌మాట్

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్, కడెం మండలాల రైతాంగానికి జీవనాధారమైన సదర్‌మాట్ ఎప్పటిలాగే ఈసారి కూడా ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారింది. ఈ ఆనకట్ట ద్వారా పైరెండు మండలాలకు సంబంధించి రూ.15 వేల ఎకరాలకు సాగు నీటి వసతి ఉంది. ప్రతిసారి ఎన్నికల ప్రచారంలో సదర్‌మాట్ అన్ని పార్టీలకు అస్త్రంగా మారుతోంది. ఈసారి కూడా సదర్‌మాట్ ఎన్నికల ప్రచారంపై ప్రభావం చూపిస్తోంది. గతంలో కాంగ్రెస్ హాయంలో సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం కోసం సుమారు రూ. 317 కోట్లు నిధులు ముంజూరీ చేశారు. 2014 ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం సదర్‌మాట్ పేరుతో ఎగువన 7 కి.మీ దూరంలోని పొన్కల్ గ్రామంలో బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. 2017లో మంత్రి హరీష్‌రావు పనులకు శంకుస్థాపన చేసినప్పటికి పనులు ఇంకా పూర్తి కాలేదు. ఇదిలా ఉంటే తొలకరి వర్షాలకే గోదావరి జలాలతో నిండిపోయే సదర్‌మాట్‌కు ఎగువన అదే పేరుతో నిర్మిస్తున్న బ్యారేజీ వల్ల సాగనీటి ఇబ్బంధులు ఎదురవుతాయని ఇక్కడి రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ రైతుల కోరిక మేరకు 2018 ఎన్నికల ప్రచారంలో బ్యారేజీ నుంచి పాత సదర్మాట్ వరకు ఆరు నెలల్లోగా ప్రత్యేక కెనాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీతో ఆయకట్టు రైతులు ఆ ఎన్నిల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారు. కాని కేసీఆర్ ఇచ్చిన హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని రైతులు ఆరోపిస్తున్నారు. బ్యారేజీ నిర్మాణం పూర్తికాగానే సదర్‌మాట్ వరకు ప్రత్యేక కెనాల్ నిర్మిస్తామని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రచారంలో రైతులను మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు మరోసారి రైతులను మోసం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ప్రతిపక్ష నాయకులు వివరిస్తున్నారు. ఇలా ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల నాయకులంతా సదర్‌మాట్ సమస్యపై తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. రైతులు మాత్రం తమ అంతరంగాన్ని బయట పెట్టకుండా మౌనం పాటిస్తున్నారు. ఈ క్రమంలో సదర్‌మాట్ కింద ఆదారపడి ఉన్న ఖానాపూర్, కడెం మండలాల్లోని 24 గ్రామాల రైతులు ఈసారి ఎన్నికల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

కేసీఆర్ హామీలు నేరవేరేనా...

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 26న సీఎం కేసీఆర్ ఎన్నిల ప్రచారానికి ఖానాపూర్ రానునున్నారు. ఆరు నెలల్లో ప్రత్యేక కెనాల్ నిర్మిస్తామని చెప్పిన ఆయన ఇంతవరకు పాత సదర్‌మాట్ గురించి ఎక్కడా మాట్లాడలేదు. ఈసారి మళ్లీ ఎన్నికల ప్రచారానికి రావడం రైతుల్లో చర్చసాగుతోంది. ఆయన గతంలో ఇచ్చి నెరవేర్చని హామీల విషయంలో రైతులను ఈసారి ఎలా మెప్పిస్తారో చూడాలి.



మతోన్మాద బీజేపీని ఓడించి, లౌకికవాద పార్టీలను బలపర్చాలి

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్


మతోన్మాద బీజేపీని ఓడించి, లౌకికవాద పార్టీలను బలపర్చాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్మల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేస్తూ, ఉపాది హామీ కూలీలకు ఇచ్చే బడ్జెట్‌లో కోతలు విధిస్తూ క్రమక్రమంగా ఉపాధిహామీ పనులను ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. లౌకికవాద పార్టీలను గెలిపించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, నిర్మల్ మండల కమిటీ అధ్యక్షులు బరుకుంట గంగారాం, మండల కార్యదర్శి చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించాలి

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-ముధోల్

బీఆర్ఎస్ అభివృద్ధిని చూసి ఆదరించాలని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తరోడా గ్రామంలో నిర్వహించిన రోడ్డు షోలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టనన్ని ఎన్నో సంక్షేమ పథకాలు కేసీఆర్ ప్రవేశపెట్టారని అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళు న్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. నేను గ్రామాల్లో అభివృద్ధి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్, ఎంపీటీసీ బండారి గంగాధర్, సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు మహబూబ్‌ఖాన్, సాయగౌడ్, అరిపోద్దీన్, నాయకులు చిన్నన్న, మొనాజీ, యూనిస్ పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటేయ్యాలి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగు రామన్న



ప్రచారంలో భాగంగా రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేయడం ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పతనమని తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కుమ్మరివాడ, శాంతినగర్, రవీంద్ర నగర్, బొక్కల గూడ, కోలిపుర కాలనీలలో ఎమ్మెల్యే రోడ్ షో నిర్వహించారు. మహిళలు తిలకం దిద్ది, మంగళహారతులతో స్వాగతం పలకగా దారి పొడవునా పూల వర్షం కురిపించి అభిమానం చాటుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించిన ఎమ్మెల్యే మరోసారి కారు గుర్తుకే ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు భరోసా కల్పిస్తున్నామని, ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించిన ఆయన అభివృద్ధి చేసిన పార్టీకి పట్టం కట్టాలని కోరారు. పట్టణ రూపురేఖలు మార్చేలా కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. ఇంటింటికి అందుతున్న సంక్షేమ పథకాలతో సామాన్య ప్రజానీకం ఇబ్బందులు దూరం చేసినట్టు వివరించారు. రైతులు, మహిళలు, యువతను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీ తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు రాజు, శ్రీదేవి లక్ష్మణ్, నాయకులు రాము, చిన్న పటేల్, అతీక్ పాల్గొన్నారు.

మసీదుల వద్ద ప్రచారం..

శుక్రవారం వివిధ మసీదుల వద్ద ఎమ్మెల్యే జోగు రామన్న సందడి చేశారు. ముస్లింల ప్రార్థనల అనంతరం ఒక్కొక్కరిని ఆలింగనం చేసుకుంటూ బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. మైనార్టీ కోసం పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

ముమ్మరంగా స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వతంత్ర అభ్యర్థి అల్లూరి సంజీవ్ రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌తో కలిసి మసీదుల వద్ద శుక్రవారం నమాజ్ తరువాత ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసిన గుర్తింపు రాలేదని, సీనీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాడానికి సంజీవ్ రెడ్డిని స్వతంత్ర అభ్యర్థిలో నిలబెట్టామని సాజిద్ ఖాన్ అన్నారు. ప్రజలు సహకారం అందించి ఉంగరం



గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేస్తు సహకరించాలని ఓటర్లను విన్నవించారు.

ఖానాపూర్‌లో హ్యాట్రిక్ విజయం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఖానాపూర్ నియోజకర్గంలో హ్యాట్రిక్ సాధించేల బీఆర్ఎస్ శ్రేణులు పని చేయాలని నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని మర్కుగూడతో పాటు ఆయా గ్రామాల్లో నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలతో పాటు మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి జన్సాన్ నాయక్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. పేద ప్రజల సంక్షేమమం కోసం మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మారుతి డొంగ్రె, సర్మాలే శివాజీ, ఎంపీటీసీ మడావి భీంరావ్ పాల్గొన్నారు.

సురక్షిత కాన్పుకు ఆరోగ్య కేంద్రమే మేలు

నవతెలంగాణ-తాంసి

సురక్షిత కాన్పుకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంతో మేలని భీంపూర్ పీహెచ్‌సీ వైద్యుడు డా. నిఖిల్ రాజ్ అన్నారు. శుక్రవారం భీంపూర్ ఆరోగ్య కేంద్రం క్లస్టర్ గిరిగాం ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 18 మంది గర్భిణులకు రక్త పరీక్షలు చేసి ఆరోగ్య సలహాలు, సూచనలు అందిస్తు మందుల పంపిణీ చేశారు. సంపూర్ణ పోషకాహారం ప్రాధాన్యత గురించి వివరించారు. కాన్పుల మధ్య వ్యవధి కోసం తాత్కాలిక పద్ధతులైన నిరోధ్, ఓరల్ పిల్స్, అంతర ఇంజెక్షన్, పీపీఐయూసీడీ ఉపయోగించుకోవాలని వైద్యులు సూచించారు. దీనిద్వారా తల్లి పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, మానసికంగా, ఆర్థిక పరంగా ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. సురక్షిత కాన్పు కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఐదుగురు గర్భిణీలకు రిమ్స్‌కు రెఫర్ చేయడం జరిగిందని తెలిపారు. 11 మందికి న్యూట్రిషన్ కిట్స్ అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు బి.గంగాధర్, స్టాఫ్ నర్స్ ప్రవీణ, ఎంఎల్‌హెచ్‌పీలు సంధ్యారాణి, వివేక్, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, విష్ణుకుమార్, ఫార్మాసిస్ట్ అశోక్ రెడ్డి, ఆశా కార్యకర్తలు రేఖ, శంకర్ పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు నిఖిల్

బీఆర్ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-తాంసి

బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపే లక్ష్యంగా తాంసి, భీంపూర్ మండలాల్లో నాయకులు విస్తృత ప్రచారం చేశారు. శుక్రవారం మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఈవీఎం నమూనాను చూపిస్తూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రైతు సమితి మండల కోఆర్డినేటర్ కంది గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నియోజకవర్గ ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్ రెడ్డి, సదానందం, అఫ్రోజ్, అనిల్, రఘు, కాంతారెడ్డి, రజిని, రమణ, నర్సింగ్, ధనుంజయ్, గజానన్, వెంకన్న పాల్గొన్నారు.

తలమడుగు: బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్



జాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అర్లి-కె, ఉండం, సుంకిడి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్ఎస్ గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి మెట్టే కిరణ్, సీనియర్ నాయకులు కేదారీశ్వర్ రెడ్డి, గజానంద్, పోచన్న, సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, గంగాధర్, మల్లేష్, శంకర్, ప్రమోద్, భూమారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యత : మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సీఎం కేసీఆర్ ప్రజలకు మంచి చేస్తారన్న భరోసా ప్రతి ఒక్కరికి ఉందని, తమ పార్టీ ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యతను ఇస్తుందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 49వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ప్రచారానికి ఇంటికి వచ్చిన చైర్మెన్‌కు మహిళలు మంగళ హారతులతో స్వాగతించారు. ఇంటింటికి సంక్షేమ పథకాల ఫలాలు అందించి సామాన్యులకు తమ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. కేసీఆర్‌పై ప్రజలంతా సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి కారు గుర్తుకే ఓటు వేసి అభివృద్ధికే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రకాష్, బండారి సతీష్, బియ్యాల అనసుయ, అంజాద్, రఘునాథ్, కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండలంలోని బట్టిసావర్గంలోని దుబ్బాగూడలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ దర్శనాల సంగీత, జెడ్పీటీసీ నల్ల వనిత, సర్పంచ్ రాగం గంగమ్మ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం సవారీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల రాజేశ్వర్, రాగం గోవర్దన్, దర్శనాల ఏవన్, అజీమ్ ఖాన్, మల్లేష్, గంగన్న పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా..యువకుడి మృతి

నవతెలంగాణ-సిరికొండ

అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో గిరిజన యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన సిడాం దేవ్‌రావ్(22) అనే గిరిజన యువకుడు గురువారం రాత్రి సిరికొండ మండల కేంద్రం నుండి తన గ్రామానికి వెళ్లే దారిలో పెట్రోల్ బంక్ దగ్గర ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన దేవ్‌రావ్‌ను ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహిళ చట్టాలపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-తాంసి

మహిళలు వారి కోసం తయారు చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెన్నెలమ్మ మండల మహిళా సమైక్య సభ్యులతో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటూ హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, శిక్షణ నైపుణ్యాలు, లింగ వివక్షత లేని లింగ సమానత్వం కోసం పాటుపడాలి సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి వివరించారు. ఎలాంటి సమస్య వచ్చిన బయపడకుండా ఉంటూ ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ముందస్తుగానే చట్టాల గురించి తెలిసి ఉంటే నేరాలను అదుపు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు లక్ష్మి, ఏపీఎం రవీందర్, సీసీ మహేందర్, సీబీఓ శ్రీనివాస్, డీసీఓ పోచన్న, వీఓ సంఘాల సభ్యులు ఉన్నారు.

15 రోజులు 133 కేసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా 15 రోజుల వ్యవధిలో 133 కేసులతో పాటు 17 మందిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 23650 లీటర్ల ఇప్పపువ్వు పానకం, 34 లీటర్ల గుడుంబా, బెల్టుషాపుల్లో 136.98 లీటర్లు, వివిధ ప్రాంతాల్లో 42 గంజాయి మొక్కలను ధ్వంసం చేసి 10.5 కిలోల గంజాయిని పట్టుకున్నామన్నారు. 3.75 లీటర్ల ట్యాక్స్ చెల్లించని మద్యం, 697.53 లీటర్ల దేశీదారు; అనధికారికంగా విక్రయిస్తున్న 678 లీటర్ల తెల్లకల్లును పట్టుకున్నామన్నారు. కేసుల్లో 3 కార్లు, ఒక బైక్‌తో పాటు 17 మందిని అరెస్టు చేశామన్నారు. నకిలి మద్యాన్ని గుర్తించడానికి తెలంగాణ ప్రభుత్వం వీఈఆర్ఐటీ అనే యాప్‌ను రూపొందించిందన్నారు. బాటిల్ పై గల స్టిక్కలపై ఉన్న బార్- కోడ్‌ను స్కాన్ చేస్తే సమాచారం ను పొందవచ్చన్నారు. ఎలాంటి సమాచారం ఉన్న ముందస్తుగా ఎక్సైజ్ అధికారులకు అందించాలని, అలాంటి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సెల్ నంబర్ : 8712658780కు తెలియజేయవచ్చని తెలిపారు. లేదా కైలాస్ నగర్‌లోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు వచ్చి నేరుగా సమాచారం అందించవచ్చన్నారు.

డార్విన్ జీవపరిణామ పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ జీవ పరిణామ దినోత్సవం సందర్భంగా విశ్వావతరణం నుండి నరావతరం వరకు అనే పుస్తకాన్ని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత ఆవిష్కరించారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేవీవీ సభ్యులతో కలిసి పుస్తకాన్ని విడుదల చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ జీవుల పుట్టుక వాటి పరిణామ క్రమం గురించి విద్యార్థులు పుస్తకాన్ని చదివి అర్థం చేసుకున్నట్లయితే నిత్యజీవితంలో మూఢనమ్మకాలు నమ్మకుండా ఉండడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, సభ్యులు, అధ్యాపకులున్నారు.

ఎమ్మెల్యే రామన్న టాటూతో అభిమానం చాటిన సంజయ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



ఎమ్మెల్యే జోగు రామన్నపై పలువురు కార్యకర్తలు తమదైన శైలిలో అభిమానాన్ని చాటుతున్నారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఏ. సంజయ్ అనే కార్యకర్త శుక్రవారం ఎమ్మెల్యే ఫోటోను టాటూగా వేయించుకుని అభిమానాన్ని చాటారు. తన చేతిపై ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రాన్ని టాటూగా వేయించగా ఆ దృశ్యాలు సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారాయి. విషయం తెలుసుకున్న జోగు రామన్న సంజయ్‌ను అభినందించారు.

ఎమ్మెల్యే రామన్నకు పలువురి మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అభివృద్ధి పరమావధిగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జోగు రామన్నకు తమ పూర్తి మద్దతు ఇస్తామంటూ పలు కుల సంఘాల సభ్యులు అంటున్నారు. టీఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్ జోగురామన్నకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేయించి పార్లమెంట్‌కు పంపడమే కాకుండా, స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానితో ఈ విషయంపై చర్చించారని గుర్తు చేశారు.

నలుగురిపై ఆరేండ్ల పాటు సస్పెన్షన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ కాంగ్రెస్ నుండి నలుగురిని సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ చిన్నారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్లూరి సంజీవ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, నాయకులు భార్గవ్ దేశ్ పాండే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాతలను కాంగ్రెస్ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే వీరిని కాదని అధిష్టానం ఇతర వ్యక్తిని టికెట్ ఇవ్వడంతో ఆ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. స్వతంత్ర అభ్యర్థి సంజీవ్ రెడ్డికి పార్టీ అగ్ర నాయకులు ఫోన్ చేసి నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని బుజ్జగింపులు చేశారు. అయినప్పటికీ వినకపోవడంతో అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.


గాండ్ల సంఘం కమిటీ రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గాండ్ల సంఘం సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన అధ్యక్షుడు డాక్టర్ రాంప్రసాద్‌తో సహా పూర్తిస్థాయి కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం నాయకులు పిన్నాంవార్ రాజేష్, చందు ప్రకటించారు. శుక్రవారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు సంవత్సరాల కాల పరిమితితో ఎన్నుకోబడ్డ కమిటీ సంఘం బై లాస్ ప్రకారం నడుచుకోలేదని, సమస్యల పరిష్కారంలో కూడా అధ్యక్షుడు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సంఘ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలేమి లేకపోవడంతో కమిటీని ఏకాభిప్రాయంతో రద్దు చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో నూతన కమిటీని ఎన్నుకొని వివరాలు తెలియజేస్తామన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు వెంకటేష్ బీర్కుర్‌వార్, నగేష్, మల్లేష్, సుభాష్, విశ్వంత్ పాల్గొన్నారు.

వ్యూహ ప్రతివ్యూహాలతో దూసుకుపోతున్న పార్టీలు

- గెలుపే లక్ష్యంగా సర్వశక్తులు ఒడ్డుతున్న ప్రధాన పార్టీలు
- హామీలు గుప్పిస్తున్న అభ్యర్థులు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

వ్యూహ ప్రతివ్యూహాలతో నియోజకవర్గంలో పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. తమ గెలుపు ఖాయమంటే, తమ గెలుపు ఖాయమంటూ ప్రచారం జోరందుకుంది. నియోజకవర్గంలో 13మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా మూడు పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ప్రధాన పార్టీలు ముందుగానే ప్రచారాన్ని ప్రారంభించారు. కాని స్వతంత్రులు గుర్తులు ఖరారయ్యేవరకు ఆలస్యం కావడంతో గుర్తులు ఖరారైనప్పటి నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రధాన పార్టీలు మాత్రం ముందుగానే ప్రచారం ప్రారంభించాయి. ప్రతి ఇంటింటికీ తిరుతూ తమ తమ మేనిఫెస్టోలను ప్రజలకు వివరించారు. ప్రతి అభ్యర్థి తమ రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులను పిలిపించి, బహిరంగ సభలు నిర్వహించి, యువతను ఆకట్టుకునేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోడ్ షోలతో పాటు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు, వారు పనిచేసే చోటుకు వెళ్లి, తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. వ్యాపారస్తుల వద్దకు వెళ్లి, చాయ్, బజ్జీలు, అమ్ముతూ ఓట్లు అడుగుతున్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి....

గడిచిన తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి ఓటర్లను కోరుతున్నారు. ఎన్నికల ప్రచారంలో తాను దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రతి గ్రామంలో ఆలయాలను నిర్మించుకున్నామని తెలుపుతూ, నిర్మల్ జిల్లా సాధించి, మెడికల్ కళాశాల నిర్మించిన ఘనత తనదేనని ప్రజలకు వివరిస్తున్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, పెన్షన్ల పెంపుదల, కళ్యాణలక్ష్మీ, షాధీముబారక్, సీఎంఆర్ఎఫ్, వైద్య సదుపాయాల కల్పన గురించి వంటి మహత్తరమైన పథకాలతో మళ్లీ అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలను తనదైనశైలిలో ఎండగడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ గెలిపించాలని ఓటర్లను వేడుకుటున్నారు.

ప్రతి పక్షంలో ఉన్నా ప్రజలకు సేవలందించా : బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


తాను రెండు దఫాలుగా అధికారంలో లేక పోయినా ప్రజలతో మమేకమైన ఉన్నానని, ప్రజలు తన ఇంటికొస్తే వారి సమస్యలు విని పరిష్కారానికి కృషి చేశామని ప్రచారంలో తెలుపుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అభివృద్ధి శూన్యమని అల్లోల్ల కుటుంబం అభివృద్ధి కోసం కలెక్టరేట్ భవనం నిర్మించి, తమ భూముల విలువ పెంచుకున్నారని, ఎదేచ్ఛగా భూములు ఆక్రమించుకుంటున్నారని ఇకనైనా ఐకేరెడ్డికి ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరుతున్నారు.

ఆరు గ్యారంటీలను నమ్ముకున్న కాంగ్రెస్...

కాంగ్రెస్ పార్టీ బరిలో ఉన్న కూచాడి శ్రీహరిరావు పార్టీ మేనిఫెస్టో ఆరు గ్యారంటీలను నమ్ముకున్నారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాడినా తగిన ఆదరణ లభించలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నానన్నారు. తనదైనశైలిలో బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ సోనియా గాంధీ గుర్తుంచుకొని కాంగ్రెస్‌ని గెలిపించే బాధ్యత అందరిపై ఉందని ప్రచారం చేస్తూ దూసుకుపోతున్నారు.

నోటాకు ఓ ప్రత్యేక చోటు ఉంది

నవతెలంగాణ-నిర్మల్



ఏదైనా ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. అయితే ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు తమకు నచ్చకపోతే సదరు ఓటర్లు ఓటు వేయడానికి ఎవరికో ఒకరికి ఓటు వేయడానికి మనసు ఒప్పుకోక ఓటుకు దూరం ఉండే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా, తమ అభిప్రాయాన్ని నిర్భయంగా తెలిపేలా కేంద్ర ఎన్నికల సంఘం నోట (నన్ ఆఫ్ ది ఎబో)ను ప్రవేశపెట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం 2009లో సుప్రీం కోర్టును నోటను ఓటర్లు ఉపయోగించుకునేలా ఆశ్రయించింది. 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నోట ప్రతి ఎన్నికల్లో అమలవుతూ వస్తుంది. బ్యాలెట్ పత్రాలు, ఈవీఎంలపై అభ్యర్థుల పేర్లు, వారి పార్టీ గుర్తుతో పాటు తాజాగా వారి ఫోటోలను పొందుపరుస్తున్నారు. కాగా చివరన నోట సైతం బటన్ పొందుపరుస్తున్నారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే ఓటు హక్కు ఉన్నవారు, నిర్భయంగా తమకు ఎన్నికల బరిలో అభ్యర్థులు తమకు ఇష్టం లేదని అభిప్రాయం వ్యక్తం చేసేందుకు నోటాను ఉపయోగించవచ్చు. దీంతో నోటాకు ప్రత్యేక గుర్తింపు చోటుచేసుకుంది.

జిల్లాలో నోటాను వినియోగించిన వివరాలు..

నిర్మల్ జిల్లాలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ మూడు నియోజకవర్గాలు ఉన్నాయి. గత 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గంలో 1,365, 2018 ఎన్నికల్లో 1,367 నోట ఓట్లు నమోదయ్యాయి. అలాగే ముధోల్ నియోజకవర్గంలో 2014లో 1,792, 2018లో 2,267, ఖానాపూర్ నియోజకవర్గంలో 2014లో 2427, 2018లో 2,776 నోట ఓట్లు నమోదు అయ్యాయి. దీంతో పోలిస్తే ఎక్కువ శాతం ఖానాపూర్ నియోజకవర్గంలో నోట ఓట్లు నమోదు కావడం విశేషం. అయితే నోట వచ్చిన ఓట్లు అంతగా ప్రచారం లేని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు రాకపోవడం లాంటి సంఘటనలు ఉన్నాయి. అలాగే ప్రధాన పార్టీలకు సైతం ఈ నోట ఓట్లు ఓటములకు ప్రధాన కారణాలు గా లేదా మెజార్టీ తగ్గించే విధంగా పనిచేస్తున్నాయి. మొత్తానికి ఓటు హక్కు ఉన్నవారు నిర్భయంగా తమ ఓటు హక్కును, అభిప్రాయాన్ని వెలి బుచ్చేలా ఈ నోటా పనిచేస్తుంది. దీంతో నోటాకు ఓ ప్రత్యేక చోటు దక్కుతుంది.

విద్యార్థులకు షీటీం సభ్యుల అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



చట్టాలపైన ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని షీటీం సభ్యులు సుశీల అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలిపారు. ఇంట్లో చెప్పుకోలేని సమస్య మహిళాలకు ఏర్పడితే షీ టీమ్‌తో చెప్పుకోవాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు జిల్లాకు రాహుల్ గాంధీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం ఆదిలాబాద్ పట్టణానికి రానున్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో సభకు సంబంధించిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను ఆదిలాబాద్ డీస్పీ వి.ఉమేందర్ శుక్రవారం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

పేపర్ లీకేజీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి

నవతెలంగాణ-జన్నారం

పేపర్ లీకేజీల ప్రభుత్వాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ద్వారా తరిమి కొట్టాలని ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు నీరజ్ కుందన్, రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షా ఆధ్వర్యంలో, స్థానిక జింకల పార్క్ నుంచి తహసీల్దార్ చౌరస్తా వరకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన ఎన్ఎస్‌యూఐ బహిరంగ సభలో వారు మాట్లాడారు. నిధులు నీళ్లు, నియామకాలనే నినాదంతో వచ్చిన తెలంగాణ, కేవలం కేసీఆర్, కుటుంబానికే నిధులు నీళ్లు నియామకాలు వచ్చేయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదన్నారు. ఇచ్చిన ప్రభుత్వ గ్రూప్ వన్ గ్రూప్ టు, గ్రూప్ ఫోర్త్ నోటిఫికేషన్ల, పేపర్లు లీకేజీ చేసి ఎంతోమంది పేద నిరుద్యోగ విద్యార్థుల మరణానికి కారణమైన ఈ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు.

Format C-1
(For candidate to publish in newspapers TV)
Declaration about Criminal Cases
(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil)No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and Address of candidate : AJMEERA ATHMARAO
Name of Political Party: BHARATIYA JANATA PARTY
Name of Election : Legislative Assembly (Telangana State)
Name of Constituency: 005 - ASIFABAD Assembly Constituency

I AJMEERA ATHMARAO a candidate for the above-mentioned election, declare for publicinformation the following details about my criminal antecedents:

SI.No	Pending Criminal Cases			Details about cases of conviction for criminal offences	
	Name of court	Case No. and status of case	Section (S) of Acts concerned and brief description of offence(S)	Name of Cout & Date(s) of order(s)	Description of offence(s) & Punishment imposed
1.	Assistant Session Judge's court, at. Asifabad.	S.C 110/2016	U/s/147,148,341,307,332,353 r/w 34 I.P.C	Not Applicable	Not Applicable
2.	JMFC-II Asifabad.	C.C No.76/2018 (Pending)	U/s.147,148,188 r/w.149 I.P.C.	Not Applicable	Not Applicable
3.	Prl.JMFC Asifabad.	Cr No.58/2018 (Pending)	U/s.143, 447,153A r/w 149 I.P.C and 3&4 of PDPP Act.	Not Applicable	Not Applicable
4.	Prl.JMFC Asifabad.	C.C No. 550/2023 (Pending)	U/s.143,188,341, 353 r/w 149 I.P.C	Not Applicable	Not Applicable
5.	Sessions Judge Spl. Court for S.C & S.T Atrocities Court Adilabad.	S.C No.3/2022 (Pending)	U/s.376(2)(n), 201, 506, 417, 420,341,290 r/w.34 I.P.C Section 3(2)(Va) ofS.C.S.T(POA) Act.	Not Applicable	Not Applicable
6.	JMFC-II Asifabad	C.C 289/2021 (Pending)	U/s.269,270,271 r/w.149 I.P.C	Not Applicable	Not Applicable
7.	Prl.JMFC Asifabad.	Crime No. 168/2022 (Pending)	U/s.448, 420,354, 294-B, 506,r/w.34 I.P.C	Not Applicable	Not Applicable
8.	Prl.JMFC Asifabad.	C.C 408/2023 (Pending)	U/s.353,143,341,506,294 -B,147 r/w 149 IPC	Not Applicable	Not Applicable
9.	Prl.JMFC Asifabad.	C.C 587/2023 (Pending)	U/s.447,143,147,148,341,324,427,452,506 r/w 149 1.P.C and Section 3 of PDPP Act.	Not Applicable	Not Applicable

Sd/-
AJMEERA ATHMARAO

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికీ తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కడంబ అటవీ ప్రాంతంలో ఆడేపల్లి, కడంబా మధ్య ప్రధాన రహదారిపై ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బస్సులో ఉన్న స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాగజ్‌నగర్ నుంచి చింతలమానేపల్లికి వస్తున్న క్రమంలో, ద్విచక్ర వాహనంపై బెజ్జూర్ మండలంలోని బారే గూడ గ్రామ ఉపాధ్యాయులు సీఆర్టి అనసూర్య, డబ్బాగూడ గ్రామ ఉపాధ్యాయులు సిడెం గోవర్ధన్, వీరు ఆసిఫాబాద్ ఎన్నికల శిక్షణ తరగతులకు వెళ్తున్నారు. ఆడేపల్లి, కడంబా ప్రధాన రహదారి మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సుకు, ద్విచక్రవాహనం ఢీ కొనగా, ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలు కాగా వారిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పై విషయంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ సిబ్బంది తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారుల దాడులు



నవతెలంగాణ-దహెగాం

కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దహెగాం మండలంలో కుమురంభీం జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండలంలోని మొట్లగూడ గ్రామంలోని అగిడి శంకర్ కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా ఓసీ 750ఎంఎల్(2), ఆర్‌సీ 180 ఎంఎల్(2), ఐబీ 180 ఎంఎల్(1), బీర్‌లు 650 ఎంఎల్(5), మద్యం లభించగా షేక్ నాయిం కిరాణా దుకాణంలో బీర్‌లు 650 ఎంఎల్(12), లభించగా స్వాదీనం చేసుకొని వీరిపై కేసు నమోదుచేసినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కిషన్, సిబ్బంది కుమార్, మండల్, హుస్సేన్, మల్లేష్, స్రవంతి పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను గెలిపించండి

నవతెలంగాణ- కౌటాల

కారు గుర్తుకు ఓటు వేసి సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ మండలస్థాయి నాయకులు అన్ని గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ముత్తంపేటలో గడపగడపకు ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ మెనిఫేస్టో పథకాలను ఓటర్లకు వివరించారు. మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలంటే కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితేనే అది సాధ్యమవుతుందని మాలీ కులస్తులకు వివరించారు. గుండాయిపేట్‌లో ఉప సర్పంచ్ లహంచు, కార్యకర్తలు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సాండ్‌గాంలో సర్పంచ్ ఎనోన్‌కార్ ధామోధర్ ఇంటింటి ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మొగడ్‌దగడ్, కన్నెపెల్లి, పార్డీ, తుమ్డిహేటి, గుడ్లబోరి, తాటినగర్ గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు.

వామపక్ష పార్టీల మద్దతు కాంగ్రెస్‌కే



నవతెలంగాణ-జన్నారం

సీపీఐ, సీపీఐఎం న్యూడెమోక్రసీ, ప్రజాపంథా వామపక్ష పార్టీ మద్దతు

కాంగ్రెస్‌కేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్ అన్నారు. శుక్రవారం జన్నారంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జుతో కలిసి మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రజలను మోసం చేసిందన్నారు. ఆ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. అందుకు వామపక్ష పార్టీల నాయకులు చేతి గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ వామపక్ష పార్టీల నాయకుల మద్దతు కాంగ్రెస్‌కు ఇవ్వడం శుభ పరిమాణం అన్నారు తనను భారీ మెజార్టీతో గెలిపించి, ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్, జిల్లా సభ్యులు కలందర్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మచ్చ శంకరయ్య, సయ్యద్ ఇసాక్ మిక్కిలినేని రాజశేఖర్, ఫసిఉల్లా పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

నవతెలంగాణ-దహెగాం

మరోసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని సిర్పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలం లోని ఇట్యాల బొర్లకుంట రాళ్ళ గూడ లగ్గం చిన్నతిమ్మాపూర్, హతిని తదితర గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు అన్ని రకాలుగా కేసీఆర్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. రానున్న ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఆత్మ చైర్మన్ కొమురగౌడ్, జడ్పీటీసీ శ్రీరామరావు, నాయకులు సంతోష్‌గౌడ్, బండ కృష్ణమూర్తి, సురేష్, సోను పాల్గొన్నారు.

మతోన్మాద ఫాసిస్టు పార్టీలను ఓడించాలి

నవతెలంగాణ-జన్నారం

శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో మతోన్మాద ఫాసిస్టు, బీజేపీని, దానితో జతకడుతున్న బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ రాష్ట్ర నాయకులు నందిరామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయంగా లబ్ది పొందడమే తప్ప ఆ పార్టీల ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. గత పది సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి బీఆర్ఎస్ తెలంగాణ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కిందన్నారు. తెలంగాణలో కూలీలను, రైతు కార్మిక సంఘాలకు అంటే కేసీఆర్‌కు పట్టింపు లేదన్నారు. వారి అభివృద్ధి మరిచిపోయిన ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని ప్రజలకు పిలుపుని స్తున్నామన్నారు. పోడు భూములకు పట్టాలి ఇవ్వడంలో దళితులకు మూడెకరాల భూమి ఇవ్వటంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైదని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, నిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో బలంగా ఉన్న అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంతా నాయకులు పురం శెట్టి బాపు, లక్ష్మీ కాంతం, మల్లేష్ గౌడ్, దుర్గం ఉన్నయా పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ-భీమారం

మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి శుక్రవారం మధ్యాహ్నం పోటు మోహన్‌రెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. సదరు పోలం చుట్టు వేసిన కంచె తీగలపై విద్యుత్ మోటర్లకు సరఫరా అయ్యే తీగలు తెగి పడ్డాయి. దీంతో పోలం ఒడ్డున పచ్చిక మేస్తున్న గేదె కంచె తీగలకు తగలడంతో విద్యుత్ షాక్‌తో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. తమకు జరిగిన నష్టానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతు మోహన్‌రెడ్డి వేడుకుంటున్నారు.

యువత ఆలోచించి ఓటు వేయాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

యువత ఆలోచించి ఓటు వేయాలని, సోషలిస్ట్ పార్టీ(ఇండియా) చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి న్యాయవాది రాజలింగు మోతె పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో శుక్రవారం సైకిల్ తొక్కుతూ సూపర్ బజార్ ఏరియా, శివాజీ నగర్, హనుమాన్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్య పెట్టేందుకు అభ్యర్థులు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని, యువత ఆలోచించి అగ్గిపెట్ట గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవుల దుర్గాప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

వసతి సౌకర్యాలను పరిశీలించిన ప్యానల్ టీం

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని శుక్రవారం ప్యానల్ టీం సందర్శించారు. టీం సభ్యులు విద్యాలయంలోని భోజన వసతులు హాస్టల్ నిర్వహణ తరగతి గదులను పరిశీలించారు. సీసీఈ రికార్డ్స్ నైట్ డ్యూటీ రిజిస్టర్ ల్యాబ్ రిజిస్టర్లను ల్యాబ్ ఎక్విప్మెంట్స్ లైబ్రరీ టీచర్స్ రికార్డ్స్ అటెండెన్స్ రిజిస్టర్ కిచెన్ గార్డెన్ పరిశీలించి ఇన్‌ఛార్జి సుమన్‌కు తగు సూచనలు చేశారు. పానెల్ టీంలీడర్‌గా హెచ్ఎం సత్యనారాయణ వ్యవహరించగా దండేపల్లి మోడల్ స్కూల్ నుంచి సుజాత, రమేష్, మహేశ్వర్ రాజు, చైతన్య స్రవంతి, లక్సెట్టిపేట్ మాణిక్, సుమన్, రాజయ్య శాంకరి, మమత, భీమారం కనక లక్ష్మీ, భీమిని రత్నమాల పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

వృద్ధులు, వికలాంగులు తమ తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగులకు నడిచి వెళ్లి ఓటు వేసేందుకు ఇబ్బందిగా ఉంటుందని, ప్రభుత్వం వారికి నేరుగా ఇంటి వద్దే ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. అందులో భాగంగానే శుక్రవారం నర్సాపూర్(జి) మండలం టెంబుర్ని గ్రామంలో ఓ వృద్ధురాలు ఓటును వేసి సద్వినియోగం చేసుకుంది.

రాజ్యాంగంపై అవగాహన, వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఎం-21(21వ శతాబ్ద బహుజన ఉద్యమం) ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై అవగాహన, ఓటు హక్కు విషయమై ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలో జూనియర్ కాలేజ్ విద్యార్థులతో పాటు మోడల్ కాలేజ్ ఇంటర్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం21 మండల ఇన్‌చార్జ్ పల్లె మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు బాబా సాహెబ్ అంబేద్కర్ దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం సోదరభావం కల్పించేందుకు రచించిన రాజ్యాంగంలో పౌరుల విధులు బాధ్యతలు హక్కుల విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 21 శతాబ్దపు బహుజన ఉద్యమ సంస్థ ఎం-21 ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన ప్రథమ ద్వితీయ విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. శనివారం కాలేజ్ ఆవరణలో జరిగే ఎం-21 ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజ్యాంగంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలను కూడా నిర్వహించి బహుమతులు ఇవ్వడం



జరుగుతుందని అన్నారు. వ్యాసరచన పోటీలను కాలేజ్ ప్రిన్సిపల్ రవీందర్, ఎం-21 జిల్లా ఆపరేషన్ టీం సభ్యుడు కొమ్ముల బాపు, సామాజిక చైతన్య వేదిక ప్రధాన సలహాదారు మదినేని చిన్న భీమయ్యలు ప్రారంభించారు.

బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల చీకటి కూటమిని ఓడిద్దాం

- భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యుడు వడ్డెపల్లి మనోహర్

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం చీకటి కూటమిని ఓడిద్దామని భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యులు వడ్డెపల్లి మనోహర్, ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి రాజన్న పిలుపునిచ్చారు. శుక్రవారం గోలేటిలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ సమాజం నిర్బంధాలను ఎదుర్కొని, లాఠీ దెబ్బలు తిని, జైలు జీవితం గడిపి వేలాది మంది విద్యార్థులు, యువకులు ప్రాణాలు అర్పించి రాష్ట్రాన్ని సాధిస్తే అధికారం అందుకున్న కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీకి, ఎంఐఎం పరోక్షంగా సహకరిస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒకే తాడు ముక్కలని, బీఆర్ఎస్‌ది నిరంకుశ విధానమైతే బీజేపీది మతోన్మాద పాసిస్టు విధానాలు అవలంభిస్తుందని ఎంఐఎం ముస్లిం కాలు చూపుతూ ఈ రెండు పార్టీల అధికారం యదాతదంగా కొనసాగాలని రాష్ట్ర ఒప్పందంతో రెండు పార్టీలకు బీటీంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు పగలు విమర్శలు, చీకట్లో విందులు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడు పార్టీలను ఓడించేందుకు తెలంగాణ ప్రజలు, ప్రశ్నించే శక్తులు, ప్రజాస్వామిక వాదులు, రాజ్యాంగ బద్ధ వాదులు సమానత్వం, సమభావన, ప్రాథమిక హక్కుల రక్షణకై వ్యక్తులు చేతులు కలిపి నిరంకుశ బీఆర్ఎస్ పాసిస్టు బీజేపీ ఈ రెండు పార్టీలకు బీ టీంగా ఉన్న ఎంఐఎంను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజయ్య, లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు దుర్గం రవీందర్, కిశన్‌గౌడ్, బాలునాయక్, రమేష్ పాల్గొన్నారు.

సన్నరకం వడ్లతో రైతులకు లాభం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగులో జీనెక్స్ సీడ్స్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం చిట్టి పొట్టి అనే సన్న రకంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. దీనికి రైతులు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు. చిట్టి పొట్టి సన్న రకం అధిక దిగుబడులు, రోగాలను తట్టుకుంటుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. చిట్టి పొట్టి రకం తక్కువ రోజుల్లో పంట వచ్చి చీడ పీడల బారిన పడకుండా కాపాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రాజశేఖర్, లక్ష్మణ్, డీలర్ సత్యనారాయణ, ట్రేడర్స్ కలమడుగు శేఖర్ పాల్గొన్నారు.

దళితులను మోసగిస్తున్న పార్టీకు బుద్ధి చెప్పాలి

నవతెలంగాణ-భీమారం

దళితులకు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇస్తూ వాటిని నెరవేర్చకుండ మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ది చెప్పాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ముల సంపత్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలో గల వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకట స్వామికి మద్దతు తెలిపారు. అధికారం కోసం దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీలు హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో తమ దళితుల ఆగ్రహాన్ని ఓటు రూపంలో చవి చూడక తప్పదని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతగల్ల శ్రీనివాస్ మదిగ, ప్రధాన కార్యదర్శి సుంకుల సంపత్ మాదిగ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమ్ముల శ్రీనివాస్ మాదిగ, మాచర్ల శ్రీనివాస్ మాదిగ, పాత యాదగిరి, సిద్దిపేట జిల్లా నాయకులు భాస్కర్, రజినికాంత్, సంపత్, శివ, హైదరాబాద్ నాయకులు పవన్ కుమార్, శివ కుమార్, నవీన్ పాల్గొన్నారు.

నిర్భయంగా తమ ఓటు వేయాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తాండూర్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం అశోక్‌నగర్ నుంచి కొత్త గుడిసెలు మీదుగా తాండూర్ పోలీస్‌స్టేషన్ వరకు 60 మంది తాండూర్ సర్కిల్ పోలీస్ సిబ్బంది ఇండియన్ రిజర్వు బెటాలియన్‌తో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసి ఎన్నుకునే విధంగా పూర్తి భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగావినియోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసు శాఖ నిఘా ఉంచిందన్నారు. ఓటర్లను మభ్యపెట్టి భయభ్రాంతులకు గురి చేసే చర్యలను హరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కవాతులో తాండూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీ శ్రీనివాస్ రావు, మాదరం ఎస్సై అశోక్, తాండూరు ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని యాచకురాలి మృతి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఎక్స్‌రోడ్డులో యాచకురాలు శుక్రవారం రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సదర్ టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం ఓటరు బాధ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో సమావేశం ఏర్పాటు చేసి ఓటు హక్కును వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. నూతన యువ ఓటర్లు డిగ్రీ విద్యార్థులు తమ ఓటుతో పాటు తమ కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారందరు ఓటు వినియోగించుకునేలా కృషి చేయల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపల్ ప్రభాత్ రావ్, జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు ఉమాకాంత్, మెస్రం రాజు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజలకు భరోసా బీఆర్ఎస్

• ఎమ్మెల్యే జోగు రామన్న



కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ సామాన్య ప్రజలకు భరోసా కల్పించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న సారథ్యంలో భారీ సంఖ్యలో వంట ఆచారిల సంఘ సభ్యులు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. అనంతరం సంఘ సభ్యులంతా జోగురామన్నకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తీర్మాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వంట గ్యాస్‌ను ఉచితంగా ఇస్తామని చెప్పిన బీజేపీ గ్యాస్ ధరలను రూ.1200కు పెంచిందని మండిపడ్డారు. నిత్యావసర సరకుల ధరలను భారీగా పెంచడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు దేశం దృష్టిని ఆకర్షించాయని పేర్కొన్నారు. సంఘ సభ్యులంతా ముక్తకంఠంతో తనకు మద్దతు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచారి సంఘం అధ్యక్షులు దేవన్న, గౌరవ అధ్యక్షులు జలీల్ పాషా, షేక్ ఫెరోజ్, సుభాష్, గంగన్న, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నాయకులు యూనుస్ అక్బానీ, ఏజాజ్, అష్రఫ్ పాల్గొన్నారు.

ప్రతి పల్లెను ముక్రా(కె)లా మారుస్తా..



నవతెలంగాణ-ఇచ్చోడ

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ముక్ర(కె) గ్రామంలా అభివృద్ధి చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్ర(కె)లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మండల కేంద్రం నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. దారి పొడున జై తెలంగాణ నినాదాలతో ముక్రకు చేరుకున్నారు. గ్రామస్తులు, మహిళలు మంగళ హారతులతో డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే ఆదర్శ గ్రామం ముక్ర(కె) మరింత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా మండలంలోని ఆయా గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ఒక్కసారి తనను దీవించాలిని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ మెహరాజ్ హమ్మద్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముండే పాండురంగ్, ముక్ర(కె) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పర్యటనను రద్దు చేసుకోవాలి

• రెబల్ అభ్యర్థి గెలుపుపై ధీమా



మాట్లాడుతున్న మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సెక్యులర్ పార్టీగా ఉన్న కాంగ్రెస్ నేడు కొందరి చేష్టల వల్ల అప్రతిష్ట పాలయ్యిందని, ఒక ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలాలు కలిగిన వ్యక్తికి టికెట్ కేటాయించి వారికి మద్దతుగా ఎన్నికల ప్రచారానికి అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొనడం కష్టపడి పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలకు నాయకులను అవమానపర్చడమేనని మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. రాహుల్ గాంధీ పర్యటనను రద్దు చేసుకోవాలని హెచ్చరించారు. శుక్రవారం కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతతో కలిసి సీఆర్ఆర్ నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆరు నెలలుగా రాహుల్ గాంధీ తెలంగాణలో ఎక్కడ సభలు నిర్వహించినా కాంగ్రెస్ శ్రేణులను తరలించడంలో తాము ఎంతో కష్టపడ్డామన్నారు. ఎంతోమంది కార్యకర్తలు తమ పిలుపుమేరకు సొంత చార్జీలు పెట్టుకుని మరీ సభలకు హాజరై విజయవంతం చేశామన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాలు, బీజేపీ నుంచి వచ్చిన వారికి టిక్కెట్టు ఇచ్చేది లేదని తెల్పి చెప్పిన రాహుల్ గాంధీ నేడు అదే బీజేపీ నుంచి వచ్చిన ప్యారాషూట్ నాయకుడికి టికెట్ ఇచ్చి మాట తప్పారని గుర్తుచేశారు. ఎంతోమంది ముస్లీం, మైనార్టీ నాయకులు పార్టీ కోసం కష్టపడుతున్నారని, వారందరికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కేవలం డబ్బులు ఎరగా వేసి టికెట్ తెచ్చుకున్న వ్యక్తికి ఎవరు మద్దతు తెలపడం లేదని, అట్టడుగు కులాల వారిని అవమానపరుస్తూ కేవలం డబ్బుందనే అహంకారంతో ఊగిపోతున్న వ్యక్తి చరిత్ర తెలుసుకుని రావాలన్నారు. అలాంటి వ్యక్తి ప్రచారానికి వస్తే ప్రజలు తిరస్కరిస్తారని, పర్యాటనను వాయిదా వేసుకోవాలని హెచ్చరించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో తామే గెలుస్తున్నామని, ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమే: ఐకే రెడ్డి



రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

బీజేపీ, కాంగ్రెస్ మాయమాటలు, మోసపూరిత హామీలను నమ్మితే ఆగమైతామని మంత్రి, నిర్మల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంజులాపూర్, వెంకటాపూర్, శాంతినగర్ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వచ్చిన మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. రోడ్ షో, ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మ్యెనిఫెస్టో వివరిస్తూ గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా తనను మరోసారి ఆశీర్వదిస్తే, మరింత అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయా కాలనీల్లో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న



తెలంగాణను బీజేపీకి, కాంగ్రెస్‌కు అప్పగిస్తే మన బతుకులు ఆగమైతావనే విషయాన్ని గ్రహించాలని, ఒక్కసారి కాంగ్రెస్ పాలనను గుర్తు తెచ్చుకొని ఆలోచించాలన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పిన నిర్మల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, మరోమారు కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేఖ విధానాల వల్ల దేశంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మండిపోతున్నాయన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని, అధికారంలోకి రాగానే పేదలకు రూ. 400కే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలే గెలిపిస్తాయి



నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలే తమను గెలిపిస్తాయని ఆ పార్టీ అభ్యర్థి ఆదే గజేందర్ అన్నారు. శుక్రవారం మహారాష్ట్ర మాజీ మంత్రి శివాజీ మోగేతో కలిసి మండలంలోని భరంపూర్, పల్లి-కే, పల్లి-బి, లచ్చంపూర్, సుంకిడి, కుచులాపూర్, లింగి, కొత్తూర్, తలమడుగులో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వస్తుందని, కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం అవుతారన్నారు. పదేండ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. పథకాల పేరిట ప్రజల్ని మోసం చేసిన ఘనత కేసీఆర్‌దేనాని ఆరోపించారు. మహారాష్ట్ర మాజీమంత్రి శివాజీ మోగే మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. దేశంలో కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ దాడుల పేరిట భయభ్రాంతులకు గురిచేసినప్పటికి కాంగ్రెస్ నీతి నిజాయితీతో పరిపాలన అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు డా. నరేష్ జాదవ్, ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటిసి బాబన్న, వెంకట్ యాదవ్, కమలాకర్, బాపురావు, ఆశన్న, విఠల్, అశోక్ పాల్గొన్నారు.